## గీతా గంగావతరణానికి నేపథ్యం

# నాటి రాచరిక వ్యవస్థ

- గబ్బిట దుర్గాప్రసాద్, ఎం.ఏ., బి.యస్సీ, బి.ఇడి., హెడ్‌మాష్టరు (రిటైర్డ్), ఫ్రీలాన్స్ జర్నలిస్ట్



లోభాన్ని, మోహాన్ని, మహత్వాన్ని అధికంగా ప్రేమించిన కంసుడు, తండ్రిని బంధీచేసి, రాజ్యాన్ని లాక్కొని, తండ్రివైపు వారందర్నీ ఇబ్బందిపాలు చేశాడు. వందలాది రాజులను చెరసాలలో బంధించాడు. వీనికితోడు జరాసంధుడు - గొప్ప ఐశ్వర్యప్రాప్తికోసం, పురుషమేథాన్ని చేయటానికి సిద్ధమైనాడు. దుర్యోధనుడు - దాయాదులైన పాండవరాజ్యాన్ని, సంపదను కపట జూదంలో లాగేసుకున్నాడు. అంతేగాక, అరణ్య, అజ్ఞాతవాసాల అనంతరం అనుకున్న ప్రకారం ఇవ్వాల్సిన వారి రాజ్యాన్ని ఇవ్వకుండా, సూదిమొన మోపినంత నేలకూడా ఇవ్వను అని భీష్మించి, కొంపకే యెసరు తెచ్చుకున్నాడు. లోభానికి, బలసంపదకూడా కురురాజుకు తోడైంది. అందుకే అతిభయంకర కురుక్షేత్ర సంగ్రామం ప్రజ్వరిల్లింది. దాయాదుల మధ్య రేగిన తీవ్రయుద్ధం అయ్యింది. "When greek fights greek, then the tug of war is terrible". అక్కడ భయానక యుద్ధం జరిగినట్లే, ఇక్కడా అదేస్థాయి యుద్ధం జరిగింది. 18 అక్షౌహిణులసైన్యంలో చివరికి మిగిలింది 10మంది మాత్రమే. ప్రవృత్తి మార్గానికి వశులై, లోభ, మహత్వకాంక్షల చేతిలో చిక్కి యుద్ధం చేయతలపెట్టినవారు కురువీరులు. నిర్లోభం యొక్క ఉదాత్త స్థితిని చూపడానికి, బుద్ధి పరాక్రమం, సత్య, ధర్మ ప్రవర్తనులైన పాండవులను ఆదుకోవటానికి శ్రీకృష్ణుడు స్వయంగా ఉద్భవించాడు. ఇలాంటి యుద్ధమే అమెరికాలో జార్జి వాషింగ్టన్, ఆ దేశస్వాతంత్ర్యంకోసం చేశాడు. అలాగే అబ్రహంలింకన్ ఉత్తర, దక్షిణ భాగాల్లో, దాస్యవిముక్తికోసం యుద్ధం చేశాడు. ఈ రెండు యుద్ధాలకంటే, కురుపండవ యుద్ధం చాలా ఉదాత్తమైనది. శ్రీకృష్ణుని రాజనీతికి మచ్చుతునకగా నిలిచింది.

### సామాజిక స్థితి

ఆ కాలంలో వేదం, వేదాంతం, సౌఖ్యం, యోగం బాగా వ్యాప్తిలో వున్నాయి. భారతీయ ఆర్యులు మొదట ప్రవృత్తికి ఆకర్షింపబడి, భోగభాగ్యాలు అనుభవిస్తున్నారు. నివృత్తివైపు దృష్టి తక్కువ. ఉపనిషత్‌లు ప్రచారంలోకి వచ్చాయి. అప్పుడు వారికి సమస్త విశ్వం, నశించిపోయేదిగా తోచింది. స్వర్గసుఖం కూడా వారిని ఆకర్షించలేదు. వారి దృష్టి అంతా తపస్సు, వనవాసం మీదనే లగ్నమైంది. యజ్ఞాన్ని వదలిపెట్టకపోయినా, తపస్సుకు గొప్ప స్థానం ఇచ్చారు. మోక్షాన్ని మాత్రమే కోరారు. సృష్టి అంతా యజ్ఞంగానే భావించారు. ఇంద్రుడు తపస్సు చేస్తున్నట్లే తలచారు. అందుబాటులో వున్న భోగవస్తువుల్ని త్యజించడం, కర్మసన్యాసం మాత్రమే, మోక్ష సాధనాలుగా వుంచారు. కోరిక దరిద్రాన్నిస్తుందని కోరిక లేకపోవడం మహదైశ్వర్య కారకం అని వ్యాప్తిచేశారు. నిష్కామస్థితిలో వుండటమే, పరమోత్కృష్టమార్గం అని వేదాంతులు, తత్వవేత్తలు బోధించారు. మంత్ర బ్రాహ్మణకాలంలో ప్రవృత్తి మోతాదు ఎక్కువైతే, ఉపనిషత్కాలంలో నివృత్తి పరాయణ శిఖరాగ్రంపైకి చేరింది.

ఈవిధంగా సమాజం ప్రవృత్తివైపు పోగలిగినంతపోయి, మళ్లీ నివృత్తివైపు వంగుతోంది. ఇదొక "Sea - Saw" ఆటయ్యింది. గ్రీకుదేశంలోనూ ఇదే పరిస్థితి. 'హోమర్ కాలంలో, సమాజం ప్రవృత్తివైపు ఆకర్షింపబడితే, పైథాగరస్ కాలంలో నివృత్తివైపుకు మళ్లింది. అలాగే రోమన్లు సుఖభోగాసక్తులై వుంటే, ఏసుక్రీస్తు నివృత్తివైపుకు త్రిప్పాడు. వేలాది పురుషులతోపాటు స్త్రీలు సంసారం వదలి యోగులైనారు. అంతటా కపట ఆడంబరమే వ్యాపించింది. 'లూథర్' ప్రొటెస్టెంట్ భావాల్ని వ్యాపింపజేసి, ప్రవృత్తివైపు సమాజాన్ని నడిపాడు.

భారతదేశంలో 'యౌవనే విషయైషి' - ప్రార్థకే మునివృత్తి' అనే బావం బాగా వ్యాపించింది. యజ్ఞయాగాదులు ఖర్చుతో కూడినవి అయ్యాయి. బ్రాహ్మణ, క్షత్రియ స్వర్గసుఖంకోసం వాజపేయం, రాజసూయం, అశ్వమేథం, పురుషమేథం చేసేవారు. ఉపనిషత్తులు బాగా ప్రచారం అవటంతో నిష్కామంగా, తపస్సు, బ్రహ్మనిదిధ్యాసచేయుటయే జన్మసాఫల్యంగా భావించారు. ఈ నేపథ్యంలో భగవాన్ శ్రీకృష్ణుని గీతాబోధన అవసరమైంది. ప్రవృత్తికీ, నివృత్తికి మధ్య బిందువుపై సమాజాన్ని నిలిపే ప్రయత్నంచేసి, సఫలీకృతుడయ్యాడు.

### భగవాన్ ఉవాచ!

భారత యుద్ధసమయంలో ఇరువైపుల సైన్యాలు మోహరించివున్నాయి. రణక్షేత్రం మధ్యరథాన్ని ఆపాడు శ్రీకృష్ణుడు. అర్జునునికి కంపరం కలిగి, శ్రీకృష్ణుని శరణువేడాడు. అప్పుడాయన గీతాప్రవచనం చేశాడు. సుమారు 'గంటంబావు' సమయం పట్టేబోధ ఇది. ఆ సల్లాపం కృష్ణార్జునులకిద్దరికి మాత్రమే తెలుసు. తొలిచూపు, దృష్టివున్న సంజయునికి తెలుసు. అర్జునుని మనసులో బంధుప్రేమ, రాజ్యకాంక్ష రెండూ వున్నాయి. ఎటుచూసినా బంధువులే. అదొక 'సివిల్ వార్'. ధర్మశీలుడైన పార్థునికి విచారం రావటం సహజమే. గీతాసంవాదన కాలంలో శ్రీకృష్ణుణ్ణి అర్జునుడు 'జనార్ధనా! గోవింద' అని భగవంతునిపేర్లతోనే సంబోధించాడు. విశ్వరూపంచూపినపుడు, తాను 'కృష్ణా, యాదవా, సఖా' అని పిలిచి అవమానించినందుకు క్షమించ మన్నాడు. తత్వోపదేశకులైన ఆచార్యులను 'భగవాన్' అని సంబోధిస్తారు. కనుక శ్రీకృష్ణ భగవానుని 'దివ్యవాణి' గీత - భగవద్గీత అయ్యింది. యాస్కునికి ముందే భగవద్గీతవుంది. పాణినికికూడా కూడా చాలా ముందే గీతవుంది.

శ్రీకృష్ణుని భవద్గీత ప్రకారం - తపస్సు, సన్యాసం వద్దు అనికాదు. తపస్సువల్ల శరీరాన్ని అనవసరంగా కష్టపెట్టరాదు. అలాగే మనోదుర్బలత్వానికి లోనై సన్యాసం తీసుకోరాదు. సంపూర్ణ వైరాగ్యం లభించి, వర్ణజ్ఞానం మనసులో స్థిరపడినప్పుడు మాత్రమే సన్యాసి అవ్వాలి. అలాగాక క్షణికా

(తరువాయి 5వ పేజీలో)

(4వ పేజీ తరువాయి)

వేశంలో అంతా సన్యాసులై, అరణ్యాలకుపోతే, వనాలన్ని జనారణ్యాలై కలుషితమవుతాయి. బుద్ధులకాలంలో అచ్చంగా ఇలానే జరిగిందని మనకు తెలుసు. బాధ్యతను విస్మరించి, కుటుంబ వ్యవస్థను వదలి అడవికిపోవటం ఎంత తప్పో, సంసారలోలుడై, విషయవాంఛలు మునిగితేలటమూ అంతే తప్పు. ఈ రెంటికి సమత్వం సాధించాలని భగవాన్ ఉవాచ. ఆమధ్య బిందువుపై ఆదారపడితే 'పరమగతి' లభిస్తుంది. అందుకే యుక్తమైన ఆహారాన్ని తీసుకుంటూ, మనస్సుచేత కర్మఫలాన్ని త్యజించి కర్మచేసేవాడే యోగి - అతనే పరమపదాన్ని పొందుతాడు. కేవలం ప్రవృత్తి, కేవలం నివృత్తి పనికిరాదు. మధ్యేమార్గమే శ్రేయస్కరం.

వైదికుల కర్మనిష్టను, సాంఖ్యుల జ్ఞాననిష్టనూ యోగుల చిత్తనిరోధాన్ని, వేదాంతుల సన్యాసాన్ని, సమపాళ్లలో మేళవించి, నూతన ప్రక్రియను బోధించాడు గీతాచార్యుడు. కర్తవ్యానికి పెద్దపీట వేశాడు. ఫలాపేక్షలేని కర్మ ఉత్కృష్టం అన్నాడ. కర్తవ్యాన్ని వదిలి పారిపోతే, సాంఘికవ్యవస్థ నిర్వీర్య మౌతుంది. అరణ్యాలకు పోయి, ముక్కుమూసుకొని కూర్చోవటం కర్తవ్యాన్ని కాలదన్నటమే. వేదాంత, సాంఖ్య, యోగాలను సరైన పద్ధతిలో వ్యాఖ్యానించి, ఆచరణ యోగ్యం చేశాడు. దీనినే అనుష్టాన వేదాంతం అన్నారు. అందుకే భగవద్గీత సాంఖ్యమూ, వేదాంతశాస్త్రము, యోగశాస్త్రమూ అయ్యింది. అన్నిటి ఉత్కృష్టత అందులోనే వుంది. కనుకనే 'భగవద్గీతకు ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగవిద్య అనే సార్ధక నామాలు ఏర్పడ్డాయి.

## నవీన భక్తియోగం

పూర్వపు భక్తికన్నా, విలక్షణమైన భక్తిని ఉపదేశించాడు పరమాత్మ. అందుకే 'భాగవతసంజ్ఞ' అయ్యింది. దీనినే రాజవిద్య, రాజగుహ్యాం అన్నాడు. 'సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం ప్రజ' అన్న పరమార్ధాన్ని బోధించాడు. ఏకాగ్రతతో, ప్రేమతో భగవంతుని భజిస్తే, మోక్షం తప్పక లభిస్తుందని అనుమానం లేకుండా చెప్పాడు. ఆనాడు సమాజం అనేక మిశ్రమ కులాలతో నిండిపోయివుంది. దీనికి కారణం చంద్రవంశరాజుల నివాసాలు అన్నిచోట్లా వ్యాపించటమే. వైశ్యులు వ్యవసాయం చేశారు, వేదం, శిక్ష వదిలేశారు. స్త్రీలలో అన్నివర్ణాల, వర్గాలవారు ఏర్పడ్డారు. వాళ్లకు చదవు అబ్బలేదు. వారికి యజ్ఞయాగ, సన్యాసాలు దుర్లభమైనాయి. కనుక అజ్ఞానులైనవారు పరమ పదానికి దూరమైపోయారు. వీరంతా మోక్షానికి అర్హులుకారని అగ్రవర్ణాల అభిప్రాయం. జనతా జనార్ధనుడైన శ్రీకృష్ణ పరమాత్మ ఇలాంటి దీనజనుల ఉద్ధరణకు, ధర్మదృష్టితో వారికి ఊరడింపు కలిగించాడు. అతని బాల్యమంతా స్త్రీ, వైశ్య, శూద్రులమధ్యే గడిచిందికదా! వారి నిష్కామప్రేమ ఆయన్ను ఆకర్షించింది. అందుకే పరమేశ్వరునిలేక 'అతని దివ్యానుభూతి'ని ప్రేమించి, భజిస్తే మోక్షం వస్తుందని భరోసా ఇచ్చాడు. తర, తమ, భేదాలు లేకుండా అచంచల భక్తితో అంతా మోక్షం పొందవచ్చునని బోధించాడు. 'రామఃశస్త్ర భృతాంమహా' - 'వృష్ణేనాం వాసుదేవోస్మ' అన్న రెండు విభూతులభక్తి అగ్రస్థానం పొందింది. ముసల్మానులు మాత్రమే మోక్షం పొందుతారని ఆ మతప్రవక్తలు చెబితే, క్రిస్టియన్లు మాత్రమే ఉద్ధరింపబడతారని క్రైస్తవులు అంటుంటే, భగవద్గీత - మనుష్యులు ఏ జాతి, మతంవారైనా, ఏ రూపంలో ధ్యానించినా, మోక్షం పొందుతారని నిర్ద్వంద్వంగా తెలియజెప్పింది. "Religion of devotion" అంటే భక్తియొక్క ఉదాత్తత, శ్రీకృష్ణుని భక్తి మార్గంలోనే దర్శనం ఇస్తుంది. ఇంకెక్కడా, ఎవరూ ఇలా చెప్పినవారులేరు. ఈ భక్తిమార్గంలో పరమోత్కృష్టతను సాధించినవారే తుకారాం, తులసీదాస్, మీరాబాయి మొదలైన సాధుసంతులు. 'సతతం కీర్తయంతో మాం, నిత్యయుక్తా ఉపాసతే'' దీనికి సాక్ష్యాలే అయోధ్య, మధుర, బృందావన ద్వారక పుణ్యవాటికలు. ఈవిధంగా శ్రీకృష్ణ అవతార ధార్మిక ముద్ర మన హృదయ ఫలకాలపై శాశ్వతంగా నిలిచిపోయింది. ఆయన జగద్గురువైనాడు.